సాక్షి రంగారెడ్డి

సోమవారం | 13 | మార్చి | 2023



బీఎస్పీతోనే అభివృద్ధి

బీఎస్పీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించాలని కోరారు. 8లో▸

గ్లకోమాపై అవగాహన నడక

బంజారాహిల్స్: ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ఆదివారం గ్లకోమా వ్యాధిపై అవగాహన నడకను నిర్వహించారు. సినీ దర్శకుడు శైలేష్ కొలను, కలర్‌ఫుల్ సినిమా హీరో సుహాస్ పాగోలు, బలగం హీరో దర్శి ఈ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష్ సెంథిల్, డాక్టర్ సిద్ధార్థ్ దీక్షిత్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ బోధించేందుకు అతిథి అధ్యాపకులు (గెస్ట్ ఫ్యాకల్టీ) కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ భానుప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పీజీలో 55 శాతం ఉన్న వాళ్లు అర్హులని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం ఉంటే సరిపోతుందని తెలిపారు. ఎంఫిల్, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వాళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్



సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

షాద్‌నగర్: బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎస్పీ (దళిత్‌శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యస్థాపనకు డీఎస్పీ (దళిత్‌శక్తి ప్రోగ్రాం) విశారదన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర ఆదివారం మండల పరిధిలోని చౌలపల్లి, కంసాన్‌పల్లి, చించోడ్ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డీఎస్పీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేడ్కర్, కాన్షీరాంల ఉద్యమానికి కొనసాగింపే లక్ష్యంగా స్వరాజ్య పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం రాకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు ఉపాధి, నిరుపేదలకు ఇళ్లు లక్ష్యంగా స్వరాజ్య పాదయాత్ర కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు పదివేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసినట్లు, గ్రామాల్లో పాదయాత్రకు మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, ఉపాధ్యక్షుడు నర్సింలు, మండల అధ్యక్షుడు చెన్నయ్య, నాగరాజు, రాఘవేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కౌసల్యకు విశిష్ట వనిత పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న జూపల్లి కౌసల్య

షాద్‌నగర్: ఉత్తమ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు గాను షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ జూపల్లి కౌసల్య విశిష్ట వనితా పురస్కారాన్ని అందుకుంది. మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని ఇటికాల వీరయ్య ప్రజాపతి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న శాలివాహన మహిళలకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేజీవీ సరిత చేతుల మీదుగా కౌన్సిలర్ జూపల్లి కౌసల్య విశిష్ట వనితా పురస్కారాన్ని అందుకుంది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పతంజలి యోగాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శశిధర్



యోగా సాధన చేయిస్తున్న శశిధర్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ అన్నారు. పట్టణంలోని సీఎస్‌కే విల్లాస్ ఆవరణలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ప్రాణ యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా సాధన చేయాలన్నారు. తద్వారా అనేక రోగాలు నయం అవుతాయన్నారు. ప్రాణ యోగా ద్వారా నవీన వైద్య శాస్త్రంలో శాశ్వత నివారణలేని వ్యాధులైన బీపీ, షుగర్, ఆస్తమా, కిడ్నీ సమస్యలు, మైగ్రేన్ డిప్రెషన్, థైరాయిడ్, అధిక బరువు, స్పాండిలైటిస్, కీళ్ల నొప్పులు, గ్యాస్, మలబద్ధకం, గుండె జబ్బులు, ఎలర్జీ, క్యాన్సర్ వంటి రోగాలను నయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉచిత ప్రాణయోగ శిక్షణ తరగతులు ఈ నెల 12 నుంచి 20 వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ శిక్షణ తరగతులు ఉదయం 5 గంటల నుంచి 6.30గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఉచిత ప్రాణయోగా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంతా సిద్ధం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లావ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ హరీశ్

తుక్కుగూడ: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, వెటర్నరీ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఎన్నికల సిబ్బంది తమకి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తీసుకుని బయలుదేరారు. అధికారులు వారికి ప్రత్యేక వాహన సదుపాయం కల్పించారు. కలెక్టర్ హరీశ్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 4,870 మంది పురుషులు, 4,315 మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ కలిపి మొత్తం 9,186 ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉందన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆర్డీఓలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



పోలింగ్ సామగ్రి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరీశ్, ఇతర అధికారులు



పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

బందోబస్తుపై సిబ్బందికి సూచనలు

మీర్‌పేట: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ సజావుగా జరిగేందుకు అంతా సిద్ధం చేసినట్టు చెప్పారు. అనంతరం బందోబస్తుకు సంబంధించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీసీపీ వెంట ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ సైదులు ఉన్నారు.



జిల్లెలగూడ పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ సాయిశ్రీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసుల తనిఖీలు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహెడ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని ఎస్ఐ శేఖర్ ఈ సందర్భంగా తెలిపారు. వాహనాల్లో మద్యం, నిషేధిత వస్తువులు తరలించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్ సరిగాలేని 15 వాహనాలను పీఎస్‌కు తరలించినట్లు చెప్పారు.



ఇబ్రహీంపట్నంలో పోలీసు బందోబస్తు

సర్వర్ డౌన్!



ఆర్టీఏలో స్లాట్ సమయానికి ముందే సర్వీసులకు బ్రేక్

- పది నిమిషాలు ముందుగానే కౌంటర్ల మూసివేత
- స్లాట్ ఉన్నా సర్వీసులు లభించడం లేదంటున్న వాహనదారులు
- పౌర సేవలపై అనూహ్యంగా పెరిగిన డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన సతీష్ ఆటో డ్రైవర్. కొద్ది రోజుల క్రితం బండి ఫిట్‌నెస్ కోసం సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాడు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న సమయం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ సేవలను అందజేయాలి. కానీ మధ్యాహ్నం 1.50 గంటలకే సేవలు నిలిచిపోయాయి. ఖైరతాబాద్‌లోని రవాణా కమిషనర్ కార్యాలయంలోని ప్రధాన సర్వర్ నుంచి నెట్‌వర్క్ ఆగిందని, దీంతో తాము పౌరసేవలను కొనసాగించలేమని సిబ్బంది స్పష్టం చేశారు. నిబంధనల మేరకు ఫీజు చెల్లించి, స్లాట్ నమోదు చేసుకొన్నప్పటికీ పది నిమిషాలు ముందే పౌరసేవలను నిలిపివేయడం వల్ల ఆటోకు ఫిట్‌నెస్ పొందలేకపోయినట్లు అతడు విస్మయం వ్యక్తం చేశాడు. ఈ సమస్య సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయంలోనే కాదు నగరంలోని పలు చోట్ల ప్రాంతీయ రవాణా కార్యాలయాల నుంచి ఇదే తరహా ఫిర్యాదులు వ్యక్తమవుతున్నాయి. నిర్ణీత సమయం ప్రకారం ఆర్టీఏ కేంద్రాలకు వెళ్లినప్పటికీ మధ్యాహ్నం 2 గంటల్లోపే సేవలు నిలిచిపోతున్నాయని పలువురు వాహనదారులు చెబుతున్నారు.

స్లాట్ ఖల్లాస్..

- శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కోసం హాజరయ్యే డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పరీక్షలకు మినహాయించి ఇతర అన్ని రకాల పౌరసేవలకు రవాణా శాఖ మధ్యాహ్నం 2 గంటల వరకు సమయం విధించింది. ఇందుకనుగుణంగా వివిధ రకాల పౌర సేవల కోసం స్లాట్‌లు అందుబాటులో ఉంటాయి. వాహనదారులు తమకు కావాల్సిన సేవల కోసం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్టీఏ కేంద్రాలను సంప్రదించవచ్చు. లెర్నింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్, చిరునామా మార్పు, యాజమాన్య బదిలీ, ఆర్సీలు తదితర సుమారు 50 రకాల పౌరసేవల కోసం వాహనదారులు మొదట ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని, ఆన్‌లైన్‌లో లేదా ఈ సేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించి సంబంధిత డాక్యుమెంట్‌లతో మధ్యాహ్నం 2 గంటల్లోపు అధికారులను సంప్రదించాలి.
- ఇలా మధ్యాహ్నం 2 గంటలలోపే వచ్చినప్పటికీ 10 నిమిషాలు ముందే సేవలను నిలిపివేయడంతో చివరి వరుసలో ఉన్న వినియోగదారులు నష్టపోతున్నారు. వారు తమ స్లాట్‌ను మరో రోజుకు పొడిగించుకోవాల్సి వస్తోంది. లెర్నింగ్ లైసెన్స్ కోసం వచ్చేవారు పూర్తిగా ఆ రోజు ఉన్న స్లాట్‌ను నష్టపోతున్నారు. తిరిగి కొత్తగా నమోదు చేసుకోవాల్సి వస్తోంది. వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, విద్యార్థులు తదితరులు స్లాట్ నష్టపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. మరోసారి తమకు సెలవు లభించడం కష్టమని చెబుతున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు కచ్చితమైన సమయపాలన పాటించాలని కోరుతున్నారు.

పెరిగిన ఒత్తిడి

రవాణా శాఖలో త్రీటైర్ ఆన్‌లైన్ పద్ధతిని ప్రవేశపెట్టిన తర్వాత పౌరసేవల సంఖ్య గణనీయంగా పెరిగింది. గ్రేటర్ హైదరాబాద్‌లోనే ప్రతి రోజు సుమారు 5 వేల మందికి పైగా వాహనదారులు వివిధ రకాల సేవల కోసం స్లాట్‌లు నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య రెండు రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉంది. పైగా కొంతకాలంగా కొత్త వాహనాల నమోదు, ద్వితీయ శ్రేణి వాహనాల బదిలీల వంటి పౌరసేవలు బాగా పెరిగాయి. దీంతో ప్రధాన సర్వర్ సామర్థ్యానికి మించిన భారం పడడం వల్ల తరచుగా ఇబ్బందులు తలెత్తుతున్నట్లు సమాచారం. 'మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. కానీ సాంకేతిక కారణాలతో ఎక్కడో ఒక చోట ఇబ్బందులు తలెత్తవచ్చు. అత్యవసరమైతే సమయాన్ని పొడిగించే సదుపాయం కూడా ఉంది' అని ఆర్టీఏ అధికారి ఒకరు తెలిపారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం 2 తర్వాత మరో అరగంట పాటు వెసులుబాటు కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

సామర్థ్యం పెరిగేట్టు.. తొలిమెట్టు



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాలను గుర్తించడం నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతున్న కార్యక్రమం

- విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి
- స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాల నమోదు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాల స్థాయిని పెంపొందించేలా విద్యాశాఖ గత ఏడాది ఆగస్టు 16 నుంచి ప్రతిష్టాత్మకంగా తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల ప్రగతిని పరిశీలించేందుకు స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ఇందులో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ విధానంతో విద్యార్థుల ప్రగతి, విద్యాప్రమాణాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పాఠశాలల తనిఖీ

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం తప్పనిసరి వచ్చేలా చేయడానికి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ)లో భాగంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలందరికీ (1 నుంచి 5వ తరగతి వరకు) మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన ఈ కార్యక్రమ ఉద్దేశం. డీఈఓ, సెక్టోరియల్ అధికారులు, మండల నోడల్ అధికారులు, ఎంఈఓలు, పాఠశాల సముదాయ చైర్మన్‌లు క్షేత్రస్థాయిలో ఆయా పాఠశాలలను సందర్శిస్తున్నారు. వీరికి జిల్లా స్థాయిలో డీఆర్పీ (డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్), ఎమ్మార్పీ (మండల రిసోర్స్ పర్సన్), సీఆర్పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లు సహకారం అందిస్తున్నారు. తనిఖీ నామమాత్రంగా నిర్వహించకుండా పారదర్శకత పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. పాఠశాలల్లో తనిఖీకి వెళ్లిన సముదాయ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. జీపీఎస్ అనుసంధానం ఉండటంతో అధికారులు తప్పనిసరి పర్యవేక్షణకు వెళ్తున్నారు. బేస్‌లైన్ టెస్ట్ ఆధారంగా విద్యాప్రమాణాల స్థాయి ప్రగతి పాఠశాలలో ఎలా నమోదు చేశారనే దానిపై మరోసారి ఈ యాప్ ద్వారా మానిటరింగ్ బృందం పరిశీలిస్తోంది. విద్యార్థుల ప్రగతి ఎంత వరకు వాస్తవమో పరిశీలిస్తున్నారు. తరగతిలో ఒకరిద్దరిని పరీక్షిస్తున్నారు. దీంతో విద్యార్థి వాస్తవ సామర్థ్యాలు నమోదవుతున్నాయి. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వారంలో ఐదురోజుల పాటు బోధన, ఒకరోజు మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ప్రతీనెల చివరివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి లోపాలపై చర్చిస్తున్నారు.

పక్కాగా నిర్వహిస్తున్నాం



తొలిమెట్టు కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పాఠశాల స్థాయిలో పర్యవేక్షణ ముమ్మరం చేశాం. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు యాప్ ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పర్యవేక్షించొచ్చు. దీంతో ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.

– సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మాదాపూర్: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఆదివారం బిజినెస్ విమెన్ ఎక్స్‌పో– 2023లో భాగంగా మహిళా ఎంట్రప్రెన్యూర్స్ క్లబ్ 'వీ డూ హైదరాబాద్ చాప్టర్'ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం సింగిల్ విండో సౌకర్యం ద్వారా మహిళలకు బ్రాండింగ్, ప్యాకేజింగ్ వంటి ప్రతి సహాయాన్ని అందించనుందన్నారు. గ్రామీణ మహిళలు, గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి మండల స్థాయిలో సింగిల్ విండో సౌకర్యం ఉంటుందన్నారు. ఇప్పటికే 50 మంది ఇందులో చేరారని, మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు 'వీ డూ హైదరాబాద్ చాప్టర్, విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ క్లబ్' అధ్యక్షుడు సంజనా దూబే తెలిపారు. ఈ సందర్భంగా విజనరీ ఉమెన్ కలెక్టివ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

మాసబ్ చెరువును పరిశీలించిన టీఎంకేఎంకేఎస్, సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోసిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే మట్టిని ఎత్తిపోయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. మాసబ్ చెరువులో మట్టి డంప్ చేసిన ప్రాంతాన్ని ఆదివారం సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే చర్యలు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపాలిటీ కన్వీనర్ డి.కిషన్, మత్స్యకార్మిక సంఘం మండల నాయకుడు కామాటి ప్రభాకర్, ప్రజా సంఘాల నాయకులు కె. శారద, రత్నమ్మ, శేషమ్మ, కల్పన, ఉప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.



కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న నాయకులు



కిటకిటలాడిన మైసిగండి

మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– కడ్తాల్



బీఎస్పీతోనే పేదల అభివృద్ధి

పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం


జెండా గద్దె ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న లింగం తదితరులు

కేశంపేట: బీఎస్పీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం అన్నారు. మండల పరిధిలోని కాకునూర్‌లో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా లింగం మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించాలని కోరారు. పేదల ఓట్లతో అధికారంలో వచ్చి వారిపై రాజకీయం చేస్తూ ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మన ఓటు మన రాజ్యం నినాదంతో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోశాధికారి భీమయ్య, మల్లేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, రమేశ్, నరేశ్, కృష్ణయ్య, జగదీశ్వర్, రియాజ్, రాంచంద్రయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్



ఆర్.కృష్ణయ్య, ఎల్.రమణలను సన్మానిస్తున్న సత్యం తదితరులు

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని సత్యం టెక్నో స్కూల్ చైర్మన్ గుజ్జ సత్యం, ప్రిన్సిపల్ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పాఠశాల 12వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకురాలు విమలక్క, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యం, రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ, పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాజేందర్ నాయకులు జనార్దన్, మల్లేశ్, రామలింగం, సురేశ్, పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. బొల్లెద్దుల మౌనిక(29), లింగారెడ్డి దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి కుర్మల్‌గూడలోని ఎస్‌వీఆర్ హోమ్స్‌లో నివాసం ఉంటున్నారు. లింగారెడ్డి ఆర్మీలో రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం డీఆర్‌డీఓలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. మౌనిక కడుపునొప్పితో తరచూ బాధపడుతుండేది. అప్పుడప్పుడు దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు సర్దిచెప్పడంతో మూడు నెలల క్రితం భర్త దగ్గరకు వచ్చింది. పిల్లలు బహదూర‌పూరలోని అమ్మమ్మ దగ్గరే ఉంటున్నారు. ఆదివారం ఉదయం లింగారెడ్డి ఉద్యోగానికి వెళ్లాడు. ఆమెకు తీవ్ర కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

ఆమనగల్లు: హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో కోళ్ల వ్యర్థాలున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ సతీశ్‌కుమార్‌ను ప్రశ్నించగా తాను కృష్ణ అనే వ్యక్తితో కలిసి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కోళ్ల వ్యర్థాలను కొనుగోలు చేసి ఏపీలోని పలువురు చేపల పెంపకందారులకు విక్రయిస్తున్నామని చెప్పాడు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. కోళ్ల వ్యర్థాలను తిన్న చేపలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల వ్యర్థాలు విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్నవారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

జోరుగా బెల్టు దందా

గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది.
వైన్స్ సమయం ముగిసాక బెల్టు షాపుల్లో ఈ దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గొడవలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు.

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- వైన్స్ బందున్న సమయాల్లో పెద్ద ఎత్తున విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ



శంకర్‌పల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో వెలిసిన బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారుతోంది. వైన్స్ బంద్ ఉన్న సమయాల్లో పెద్ద ఎత్తున విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతీ గ్రామంలో గల్లీకి ఒక బెల్ట్ షాప్ వెలిసింది. దీంతో యువత, కూలీలు, రైతులు మద్యానికి బానిసలవుతున్నారు. మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో, తండాల్లో, మున్సిపాలిటీ పరిధిలోని పలు షాపుల్లో, హోటల్స్‌లో మద్యం నిల్వ చేసుకుని మద్యం అక్రమ ధరలకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముడుపులు తీసుకుని మిన్నకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పేరుకే బంద్

మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్, హనుమానగర్, సింగాపురం, రామంతపురం గేట్, పత్తేపురం, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ, చిన్న శంకర్‌పల్లి, సింగాపురం టవర్ తదితర ప్రాంతాలల్లో వైన్స్ షాపులు బంద్ ఉండే సమయాలల్లో పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా శనివారం సాయంత్రం నుంచి సోమవారం వరకు వైన్స్ మూసేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు వైన్స్ షాపులకు సీజ్ వేశారు. కాగా షాపులు మూసివేయక ముందే బెల్టు షాపుల యాజమాన్యం బెల్టు షాపులకు రెండు రోజులకు సరిపడా మద్యం సరఫరా చేశారని సమాచారం. పేరుకు మాత్రం వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్‌లు సీజ్ చేశారని కానీ బెల్టు షాపుల కారణంగా గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా లభ్యమవుతోందని ప్రజాప్రతినిదులు మండి పడుతున్నారు. బెల్టు షాపుల కారణంగా గ్రామాల్లో తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు.

గీతకార్మికులకు అండగా సర్కారు


నీరాను తీస్తున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: నీరా సంప్రదాయ ఆరోగ్యవరప్రదాయని అని ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లికి చెందిన అశోక్‌గౌడ్ ఏర్పాటు చేసిన 239 ఈత చెట్లకు సంబంధించిన వనాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీరా ఉత్పత్తులను పెంచడానికి గీతకార్మికులకు రాష్ట్ర సర్కారు అండగా ఉంటుందన్నారు. ఆరోగ్యాన్ని అందిచే నీరా ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఈత వనాలు పెంచుకునేందుకు ప్రొత్సహిస్తోందని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గీత కార్మికుల సంక్షేమం కోసం నగరం కల్లు దుకాణాలు తెరిపించిందన్నారు. చెట్లపై పన్నులు రద్దు చేయడమే కాకుండా గీతకార్మికులకు ప్రమాద బీమాను కూడా కల్పిస్తోందన్నారు. ప్రతి పల్లెలో కనీసం వంద ఈత చెట్లను పెంచితే కనీసం పదిహేను కుటుంబాలకు ఉపాధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు చెన్నం అశోక్, వై. కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు దొనాకర్‌గౌడ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములవ్వాలి

శంషాబాద్ రూరల్: సమాజసేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ పట్టణంలోని కాపుగడ్డకు చెందిన వ్యాపారవేత్త సిద్దురెడ్డి సహాయంతో సార భాగ్యవతికి టూ వీలర్‌ను ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సిద్దురెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ దొనాకర్‌గౌడ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరక్టర్ ఏ.శ్రీకాంత్‌గౌడ్, మోహన్‌రావు, మోహన్‌నాయక్, సార జంగయ్యగౌడ్, మంచాల రవి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

SEC-BAD Contonment Quiet Peaceful Pollution Free Location 3BHK Flats Nearing Completion Gated Community Clubhouse Swimmingpool Ph: 8247859501 [H-793343]

FARM LAND FOR SALE

SVT ఫాంల్యాండ్స్ & డెవలపర్స్ కేవలం 15లక్షలకే 1/2 అరఎకరము శ్రీగంధం మొక్కలతో మరియు 5సం॥లలో 10లక్షలు బై బ్యాంక్ అగ్రిమెంట్, ఇది కేవలం మొదటి 50 మందికి మాత్రమే, త్వరపడండి, ఫోన్ : 9177619716 [HA-1076]

HOUSE FOR SALE

Chintal Ganesh Nagar, Nr Main Road, Indp house N/F 200.Sq.yrds G+2 + Penthouse, 5500 sft, builtup area, Rents 75,000 P/M, Budget: 2.50Cr Negotiable. Ph: 9966379170 [H-793346]

LEASE

ABIDS, METHODIST Complex Next to SBI Gunfoundry, Shops/ Offices From 270 to 11,000 Sft On Wards for Lease Call: 9502300199 [H-793344]

PLOT FOR SALE

భువనగిరి హైవేకు దగ్గరిలో గజం: 3999/- స్పాట్ రిజి: ఫార్మ్ ప్లాట్ కొనండి మొక్కలతో ఒక సం.లో డబుల్ అయ్యే అవకాశం. ఫోన్ : 9030601717 [H-796753]

విజయవాడ హైవే (1km) Khaithapur, HMDA అప్రూవ్డ్ ప్లాట్స్ అమ్మబడును, చదరపు గజము: 12,000/- మాత్రమే. Ph: 9347675084 [HA-2466]

0% ఇంట్రెస్ట్‌తో 30 నెలల ఈక్వల్ EMIతో రాజాపూర్ దగ్గర అన్ని డేవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA(HMDA) లేఔట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్. Ph: 9949695027 [HA-1082]

సంగారెడ్డి Machepalli, DTCP అప్రూవ్ లేఅవుట్‌లో చదరపు గజము 12,000/- స్పాట్ - రిజిస్ట్రేషన్ Ph: 9347675084 [HA-2467]

@Koheda Near Pedda Amberpet-HMDA (LRS) approved plots of sizes 181, 319, 233, 520 sq yards Contact.9246363369/9666759480 [H-796731]

Plot for Sale, 241 Sq.yds, East Facing, Full LRS Paid Padmashri Hills Bandlaguda Jagir. Contact: 8522958864 [HA-10364]

PROPERTY FOR SALE

374 sqyards Gplus 1 House near to collector Office and NIT clg Hanamkonda 7989106048 [HA-10309]

TO-LET

Machabollaram, Opp: Water Tank, Newly constructed 2bhk flats 100% vastu, 24hrs Manjeera water rent / sale 9177837855 [HA-92569]

Services

BUSINESS SERVICE



ఫండ్స్ ఏర్పాటు చేయబడును చారిటబుల్ ట్రస్ట్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్లు / సొసైటీలకి C.S.R. ఫండ్స్, డొనేషన్స్ ఇప్పించబడును. ఫోన్ : 9851595954 [H-796752]

మీ బంగారుపై (92%) బ్యాంకుల్లో గాని, ముత్తూట్, మణప్పురం ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నచో మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర॥ 8247630166 [H-793386]

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792829]

మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 9494995999 [H-787442]

BUSINESS OFFER

ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన, LED's, TVs, AC's Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/ బిజినెస్ లోన్స్ ఫైనాన్స్ సౌకర్యం. ఫోన్: 9100729447 [HA-3022]

We claim your shares from IEPF (Physical Shares) Any queries (M) +91 9347116903. [HA-9248]

TAX CONSULTANT

It Returns, GST, Firm, Labour, Food Licence, Pvt Ltd, Trade Mark Reg, Trade Licence, Home Loans, Business Loans 9121204476 [H-793289]

HEALTH CARE

మద్యపానం మానేయడం ఎలా ? బరువు పెరగడానికి, జాయింట్ పెయిన్స్‌కి, షుగర్‌కు. హైదరాబాద్ : హోటల్ త్రీకాస్టల్స్, కామత్ హోటల్ ఎదురుగా, నాంపల్లి స్టేషన్ రోడ్, ప్రతీనెల 7, 14, 21 తేదీల్లో మందులు. [V- 2561]

PERSONAL CARE



CHANGE OF NAME

I, Madhu Malathi R/o. H.No. 42-739/2/1, F.No. 502, Pristine Green Meadows SP Nagar Moula-Ali Hyderabad changed my New name as Appannagari Malathi W/o. Mr. Appannagari Srinivas Rao. [H-793391]

I, Navari Srilatha D/o. Navari Anji Reddy changed my name after my Marriage to Ramidi Mahathi W/o. Ramidi Sridhar Reddy. [WB-57371]

I, Kesiraju Sudhir Babu, S/o. K. Subba Rao, R/o. Flat No. F3, Swetha Apts. Kalyan Nagar, Phase-1, Ameerpet, Hyd, TS-500038. have changed my name as Kesiraju Sudheer Babu. For all purposes. [HA-10371]

Wanted

విశ్వ టెంట్ హౌజ్‌లో పనిచేయుటకు డ్రైవర్స్ కమ్ వర్కర్స్ కావలెను. భోజనం + ఉచిత గృహ వసతి+ మంచి జీతం. చక్రిపురం, కుషాయిగూడ. ECIL సం.ప్ర. 8074013200, 8686537692 [H-793389]

జూబ్లీ హిల్స్ ఇంటినందు తెలుగు ఇంటి సాంప్రదాయ వెజ్ & నాన్ వెజ్ వంటలు, శుభ్రతతో రుచిగా వండగలిగిన ఆడ / మగ వంటవారు కావలెను. మంచిజీతం ఇవ్వబడును. ఫోన్ : 8985678833. [H-793583]

సెక్యూరిటి గార్డులు కావలెను. 8గం.ల డ్యూటి జీతం: 25,000 to 30,000 రూం+భోజనం ఫ్రీ, వయస్సు: 40సం॥ల లోపు. ఫోన్ : 9000861616, 9100089955 [HA-10372]

డ్రైవర్ కావలెను, హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో హోమ్ డ్యూటికి 15సం॥ల అనుభవము గల డ్రైవర్ కావలెను. డ్యూటీ గంటలు: 12 గంటలు. జీతం: 24,000/- నెలకు, సంప్రదించండి : 8369999108 [HA-26293]

జూబ్లీ హిల్స్ ఇంటినందు పనిచేయుటకు 5-10 సం: డ్రైవింగ్ అనుభవం గల భర్త డ్రైవర్‌గాను, భార్య హౌస్‌కీపింగ్ పనులు/ ఇంటి, వంట. రూమ్ మరియు మంచిజీతం ఇవ్వబడును. ఇతర సౌకర్యాలు పొందవచ్చు - (షరతులు వర్తిస్తాయి) సం. ప్ర. 8985678833 [H-793582]

రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు M/F టెలికాలర్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను జీ: 10-15K, బోడుప్పల్, Pillar No.77, ఫోన్ : 7981203120, 9032055834 [H-792948]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795203]

హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:18K, ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9640258899, 9640468899 [H-786847]

ప్రముఖ బ్యాంక్ DSA లో పని చేయుటకు (లేడీ) టెలికాలర్స్ కావలెను. Qly: 10th- డిగ్రీ, జీతం: 8K-12K+ ఇన్సెంటివ్స్, రాధిక థియేటర్ బ్యాక్ సైడ్, A.S. రావ్ నగర్, ECIL. ఫోన్ : 9030029292, 9866629292 [H-793388]

HYD లో పనిచేయుటకు సెక్యూ॥గార్డ్స్ కావలెను జీ॥ 15K, లేడీ గార్డ్స్ - 15K, 8గం॥డ్యూటీ, ఆఫీస్ వివేకానంద నగర్, అల్లాపూర్, HYD, తెలంగాణ. ✆ 96187 30011, 86867 18120, 76740 28417 [O-786879]

హారిక హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవ చేయుటకు హెల్పర్స్, కేర్‌టేకర్స్, ఆయాలు, అటెండర్స్, ఏజెంట్స్ (M/F) కావలెను. జీతం: 20-25వేలు, రూం+మీల్స్ ఫ్రీ. Ph: 8501869108 [HA-28978]

పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు క్యాషియర్స్ జెంట్స్ కావలెను జీతం: 13 వేలు - 14 వేలు, ESI + PF కలదు. నాంపల్లి Ph: 7799352500, 8143256750, 9849359004 [HA-28975]

ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న యువతీ, యువకులకు, గృహిణులకు గొప్ప అవకాశం. మీ ఇంటి వద్ద చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన100% Genuine ✆ 89787 74595 [B-934]

స్త్రీ/పు॥లు సెక్యూ॥గార్డ్స్ ASO, SO, నైట్ సెక్యూ॥గార్డ్స్, ఆఫీస్ బాయ్స్, హౌస్‌కీపింగ్, బౌన్సర్స్, Ex-ఆర్మీ, 8గ॥లు - 13వేలు - 30వేలు, అర్హత బట్టి జాబ్, All ఏరియాస్ సంప్ర: 9989537007. [HA-1329]

Helpers, Sales Executives Male కావలెను. ఇండస్ట్రియల్ కంపెనీ, రాణీగంజ్ సికింద్రాబాద్ hosetech99@gmail.com ఫోన్ : 9949243077, 9849096655, 7032269549 [H-793627]

Urgent Req Marketing Exe (Min 3-5yrs) Site Engineer, Production & Engineer@ Malkapur, 9948190805, 9948545550 [HA-92538]

Wanted Marketing Exe. M & F For a Reputed Construction Comp. Qual:MBA, Exp: Fresher+, Sal :15k+ Incentive, 9948656262,9948545252 [HA-28990]

Wanted Vice Principal, Female Tele Callers, Admissions Dept. Incharge, Computer Operator. Salary: 9000/- to 18000/- Any Degree, Age: 23 to 45. Job Location: Dilsukhnagar, Hyd. Contact 9246747481, 9100069079 [G-4067]

FACULTY TEACHERS

రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ పనిచేయుటకు వాచ్‌మెన్ & పనివారు (ఫ్యామిలీ), అనుభవం గల టీచర్స్, ట్యూటర్స్ కమ్ వార్డెన్స్ కావలెను. @హయత్‌నగర్, ఫోన్ :8790998430 [H-793628]

Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/- , Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-985]

SAGE SCHOOL (CBSE) Uppal Road, Medipally, Requires Exp. Passionate Teachers for all classes & Subjects including Preprimary, Art, Computer, PET, Receptionist. Attractive Salary. Walk-in-interview on 11/03/23 to 12/03/23 from 9am to 3pm. Ph: 9010802229 / 9908783168 hr@sageschool.edu.in [HA-5302]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జిఎస్టి మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

సైబర్..బీ కేర్‌ఫుల్

- పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- మోసపోతున్న సామాన్యులు, విద్యావంతులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు(ఫైల్)

శంషాబాద్ రూరల్: రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. వీటిపై పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా ఏదో ఓ చోట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుపోతున్నారు. నేటి సమాజంలో మొబైల్ వినియోగం సామాజిక మాధ్యమాలతో ప్రపంచం మన అరచేతిలో ఇమిడినట్లైంది. ఇదే సాంకేతికతను అడ్డుపెట్టుకుని సైబర్ నేరగాళ్లు చాలా సున్నితంగా దోపిడీలకు పాల్పడుతున్నారు. గత ఆరో నెలలుగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ రకమైన సైబర్ నేరాలు వెలుగు చూస్తున్నాయి. ఉద్యోగం ఆశతో నిరుద్యోగ యువత, వస్తువుల కొనుగోళ్లతో, చివరకు గేదెల కొనుగోలు కోసం ఆన్‌లైన్‌పై ఆధారపడి రైతులు కూడా మోసపోతున్నారు.

మచ్చుకు కొన్ని..

- ఊట్‌పల్లిలో నివాసముండే శారదాదేవికి గుంటూరులో ఇల్లు ఉంది. ఈ ఇంటిని అద్దెకు ఇస్తానని 'ఓఎల్ఎక్స్' యాప్‌లో ప్రకటన చేసింది. గత ఫిబ్రవరిలో ఇది చూసిన ఓ సైబర్ నేరగాడు ఇల్లు అద్దెకు తీసుకుంటానని చెప్పి గూగుల్‌పే ద్వారా డబ్బులు ఇస్తానన్నాడు. ఇందుకోసం ఆమెకు గూగుల్‌పేలో ఓ లింక్ పంపించి ఓపెన్ చేయమన్నాడు. అతను చెప్పినట్లు పిన్ నెంబరు నొక్కడంతో కొద్దిసేపట్లో ఆమె ఖాతా నుంచి రూ.50 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది.
- మల్కారం గ్రామానికి చెందిన జి.గణేష్ తన ఇంటి అవసరాలకు రూ.50 వేల కోసం 'ఇండియన్ యూనియన్ క్రెడిట్ క్యాష్ లోన్' యాప్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. తర్వాత అతని ఫోన్‌కు వాట్సాప్‌లో ఓ సందేశం వచ్చింది. లోన్ కావాలంటే రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు పలు కారణాలు చెప్పి అతని నుంచి మొత్తం రూ.32 వేలు దోచేశారు. మరో రూ.20వేలు ఇవ్వాలని లేదంటే రిజిస్ట్రేషన్ అగ్రిమెంట్ ప్రకారం కేసు పెడతామంటూ బెదిరించడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించాడు.
- డిగ్రీ చదువుతున్న తొండుపల్లికి చెందిన ఓ యువతి పార్ట్‌టైం ఉద్యోగం కోసం గూగుల్‌లో వెతుకుతుండగా ఆమె ఫోన్‌కు వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్ చేసింది. నేరగాళ్లు ఆమెకు పలు రకాల వస్తువులు చూపించి వాటిని కొనుగోలు చేయాలని, అదనంగా డబ్బులు వస్తాయని నమ్మించి పలు దఫాలుగా రూ.1,04,000 కాజేశారు.



- కవ్వగూడకు చెందిన రైతు శ్రీకాంత్‌యాదవ్‌కు వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి నుంచి హాయ్ అంటూ మెసేజ్ వచ్చింది. తర్వాత గేదెల ఫొటోలు పోస్టు చేసి వీటిని ధర రూ.1,10,000కు అమ్ముతానని చెప్పాడు. వాటిని కొనేందుకు రైతు ఆసక్తి చూపడంతో పలు రకాల కారణాలు చెపుతూ ఫోన్‌పే ద్వారా రూ.1,31,500 దోచుకున్నారు.

1903కు సమాచారం ఇవ్వాలి



సైబర్ నేరానికి గురైతే టోల్‌ఫ్రీ నంబరు 1903కు వెంటనే సమాచారం ఇచ్చి బ్యాంకు అధికారులు, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. బ్యాంకులు, సంస్థల నుంచి ఖాతాలకు సంబంధించిన వివరాలు అడగరు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎవరితో కూడా వ్యక్తిగత పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు చెప్పరాదు. వీటిపై అవగాహన కల్పించడానికి విద్యార్థులకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇటీవల న్యూడ్ కాల్స్ ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారు. అధికారుల పేరుతో కూడా నకిలీ ఐడీ సృష్టించి డబ్బులు అడుగుతుంటారు. ఇలాంటి వాటిని నమ్మొద్దు.

– ఏ.శ్రీధర్‌కుమార్, ఇన్‌స్పెక్టర్

మహనీయుల చరిత్రను బోధించండి


ఎంపీ రంజిత్‌రెడ్డితో నూతన కమిటీ సభ్యులు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి వెల్లడించారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు మహనీయుల జీవిత చరిత్రను బోధించాలని వారు చేసిన అభ్యున్నతిని నేటి సమాజానికి వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. భావితరాల భవిష్యత్తుకు పునాదులు వేసిన మహనీయుల అడుగుజాడల్లో సేవ చేయాలన్నారు. వచ్చే నెల జయంతి వేడుకలకు రూ. 5 లక్షల చొప్పున ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, శ్రీనివాస్, జీవన్‌దాస్, నర్సింహ, పోతురాజ్ యాదయ్య, శంకర్‌రావు, మంత్రి చంద్రశేఖర్, పచ్చ చంద్రశేఖర్, అనుముల జాన్‌పాల్, శ్రీనివాస్, సూర్యం పాల్గొన్నారు.

లిఫ్ట్ గోతిలో పడి వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: లిఫ్ట్ గోతిలో పడి సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖలీల్ వివరాల ప్రకారం.. అస్సాంకు చెందిన తోహిద్ ఉర్ రహమాన్(32) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి చెక్ సెక్యూరిటీ సంస్థలో గార్డుగా చేరాడు. బండ్లగూడలోని వైష్ణవి కౌండిన్య అపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న రహమాన్ శనివారం రాత్రి విధుల్లో భాగంగా ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి లిఫ్ట్ గోతిలో పడ్డాడు. ఉదయం విధులకు వచ్చిన మరో ఉద్యోగి చూసి ఏజెన్సీకి సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పరిధిలో చోటు చేసుకుంది. మాణిక్యమ్మ కాలనీకి చెందిన కరణ్‌సింగ్(27) ఎన్ఐఆర్‌డీ ప్రాంతంలోని శ్మశానవాటికలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కరణ్‌సింగ్ మృతికి గల కారణాలు తెలియలేదని కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులను ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసే చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ పేద కుటుంబాల కోసం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండేందుకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందని అందుకే బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, టి.చిన్న, శరణమ్మ, వెంకటరమణరెడ్డి, రామ్‌నారాయణ్‌యాదవ్, రాజేంద్ర పహిల్వాన్, శివకుమార్, ప్రేమ్‌సాగర్‌రాయి పాల్గొన్నారు